



గుంటూరు: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్‌లో..



గుంటూరు: అధ్వానంగా రెడ్డిపాలెం రోడ్డు

మురుగు బురద

వానొస్తే.. వణుకే.. పట్టణాల్లో ఇదీ పరిస్థితి. వాన ఆ వెంట వచ్చే బురద.. ఆ తర్వాత రోడ్లపై పేరుకుపోయే బురదతో ప్రజలు అల్లాడుతుంటారు. మురుగుతో కలిసే బురదకు తోడు చెత్తాచెదారాలు పేరుకుపోయి దోమలు, దుర్వాసన తో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అసలే అంతంతమాత్రంగా ఉండే పారిశుధ్యం.. వర్షాలు పడిన ప్పుడు మరింత అధ్వానం గా మారుతుంది. మున్సిపల్ కేంద్రాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండ టంతో ఓ మోస్తరు వర్షాలకే రహదారులు తటాకాలను తలపిస్తుంటాయి. వర్షపు నీరు పోయేంత సామర్థ్యం లేకపోవడంతో వాన నీటితో కలిసిన మురుగు రోడ్లపైకి చేరుతుంది. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు గురించి తెలిసినా మున్సిపల్ పాలకులు, అధికారులు పరిష్కారాలపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గత ఐదేళ్లు వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లోని సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం పలు పట్టణప్రాంతాల్లో ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతు న్నారు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పాడుపెట్టడం, అవుట్‌ఫాల్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు వెచ్చించకపోవడంతో ప్రస్తుతం మున్సిపల్ ప్రజలకు శాపంగా మారింది.

- మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం
- మున్సిపల్ కేంద్రాల్లో అధ్వానపు డ్రెయిన్లు
- ఓ మోస్తరు వర్షానికే పొంగిపొర్లే కాల్వలు
- దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం.. వ్యాపిస్తున్న వ్యాధులు
- ఐదేళ్లు పట్టణాలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం



గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వర్షాలతో మున్సిపల్ పట్టణాల్లో పారిశుధ్యం ఎంత అధ్వానంగా ఉందో బహిర్గతమైంది. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో ప్రధాన రహదారులు కూడా మురుగు, బురదతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక ఆయా జిల్లాల్లోని మున్సిపల్ పట్టణాల్లో వర్షాలు పడినప్పుడల్లా పారిశుధ్యం అధ్వానంగా మారుతుంది. దీంతో ప్రజలు వర్షాలు పడుతున్నాయంటే భయాందోళనలు వ్యక్తం చేస్తుంటారు. మురుగు, బురద, దోమలు, దుర్వాసనలు.. ఆపై రోగాలతో ప్రజలు అల్లాడిపోవాల్సిందే. అస్తవ్యస్త పారిశుధ్యంతో డయేరియాలాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వ్యర్థాలు రోడ్ల మీదకు వస్తున్నా యి. దీంతో పట్టణాలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలను ప్రధానంగా డ్రెయినేజి సమస్య పట్టిపీడిస్తున్నది. ఉన్న డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. తుంగ, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. దీనివల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. పారిశుధ్యం అధ్వానంగా మారి చినుకులు పడుతున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాలు, వాంతులు, విరేచనాల తో ఆస్పత్రులు బాట పట్టాల్సి వస్తోంది. వర్షాలు పడినప్పుడల్లా మీడియం, మైనర్ డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగు మేజర్ డ్రెయిన్ గుండా ప్రవహించకపోవడంతో అనేక చోట్ల మురుగు ఉబికి రోడ్లమీదకొస్తున్నది.

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పుర పాలక సంఘాలలో వరద, మురుగు నీటి కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో వర్షపు నీరు నిలిచిపోతున్నది. దోమల వ్యాప్తి ఉధృతం కానున్నది. అంటువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన సర్వత్రా నెల కొంది. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరించారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు పట్టణాల్లో ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నా పురపాలకులు అలస త్వాన్ని వీడటంలేదు. వర్షాల సమయంలో ముంపు బాధితులకు పరిహారం అందించే కన్నా ఇళ్లు ముంపునకు గురవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు.

దీనివల్లే ఏటా పేదలు పట్టణాల్లో వరద ముంపు కష్టాల ను ఎదుర్కొంటున్నారు. అధికారం అండతో కాల్వల పై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడంలేదు. కాల్వలు, డ్రెయిన్లు ఆక్రమణలతో కుచించుకుపోవడంతో వర్షాలు కురిస్తే నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వరద నీటి కాల్వలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిసినప్పుడల్లా పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు. వరద, మురుగు కాలుల్లో పూడిక తీత తక్షణావసరంగా ఉన్నా ఈ దిశగా పురపాలకులు స్పందించడంలేదు.

ప్రత్యేక శ్రద్ధపెట్టాలి..

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధ్వానంగా మారిన మురుగునీటి పారుదల వ్యవస్థను తక్షణం సంస్కరించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీల్లో పూడికలు తీసి వరద నీరు నిలువకుండా చేయాలి. మురుగు కాలువల్లో పూడిక తీయాలని ఇటీవల మున్సిపల్ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించినా వారు మొద్దు నిద్ర వీడటం లేదనే విమర్శలున్నాయి. ప్రతి మున్సిపాల్టీ లో వేసవిలోనే మురుగునీటి వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉంది. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బం దులు లేని విధంగా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవ్వకుండా వరద నీరు పారేలా ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపునకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాలలో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి.



● నగరపాలక సంస్థ వద్ద చేపల మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో దుస్థితి



గుంటూరు: సదాశివనగర్ మూడో లైన్‌లో..

ఐదేళ్లు పాడుపెట్టారు

మున్సిపాలిటీల్లో మురుగు, పారిశుధ్యం, డ్రెయినేజీల నిర్వహణపై ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కనీసంగా కూడా దృష్టిపెట్టిన పాపాన పోలేదు. పల్లపుప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతున్నా కన్నెత్తి చూడలేదు. గత ప్రభుత్వాలు ప్రారంభించిన వరద, మురుగునీటి కాల్వలను పాడుపెట్టారు. ప్రధాన కాల్వల్లో కనీసం పూడిక తీసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాల్వల్లో చెత్త పేరుకుపోయి వానలు కురిసినప్పుడు తీవ్ర దుర్గంధం వస్తున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా మున్సిపల్ అధికారులు, పాలకులు వ్యవహరించారు. దీంతో ప్రజలు దోమలు, దుర్వాసన, అంటువ్యాధులతో అల్లాడిపోవడం పరిపాటిగా మారింది. ఏ మున్సిపాలిటీలోనూ నిధులు లేకుండా ఊడ్చేసి ఖాళీ ఖజానాను వైసీపీ అప్పగించింది. బాపట్ల మున్సిపాలిటీనే దాదాపు రూ.11కోట్లలో టు బడ్జెట్‌తో ఉండడం మున్సిపాలిటీల దీనావస్థకు అద్దం పడుతోంది.

రోడ్లే కాల్వల్లా..

దాదాపుగా మూడు దశాబ్దాల క్రితమే నగరపాలక సంస్థ స్థాయికి ఎదిగిన గుంటూరులో నేటికీ ఓ మోస్తరు వర్షం కురిస్తే రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. ఏదైనా సమస్య వస్తే తప్ప మురుగు(పూడిక) తొలగించడం లేదు. నగరపాలక సంస్థ ఏటా మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టడం మినహా డ్రెయినేజీ వ్యవస్థని మెరుగుపరచలేకపోతున్నది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం, ఆదివారాల్లో కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లే కాలువల్లా మారిపోయాయి. పీకలవాగులో కలిసే డ్రెయిన్లలో మురుగునీరు వెనక్కు తన్ని రోడ్లు పైకి వచ్చేస్తున్నది. బ్రాడీపేట, అరండల్‌పేట మెయిన్ రోడ్డు, ఏసీ కళాశాల, మునిసిపల్ ఆఫీసు, పండ్ల మార్కెట్, ఏలూరు బజార్, లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, జీటీ రోడ్డు, నల్లచెరువు, ఆర్ అగ్రహారం తదితర మెయిన్ రోడ్లలో ఉన్న డ్రెయిన్లను మూసేశారు. దీంతో వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది.



● గుంటూరు ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు దుస్థితి

డ్రెయిన్లపై రూపాయి ఖర్చు లేదు..

ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్రెయినేజీలపై వైసీపీ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా ఖర్చుపెట్టలేదు. ప్రజలు ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోకుండా మున్సిపాలిటీ నిధులను సైతం పక్కదారి పట్టించింది. వాగు లు, కాలువల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని గతంలో పలుమార్లు ప్రజలు స్పందనలో ఇచ్చిన అర్జీలన్నీ బుట్టదాఖల య్యాయి. ప్రజల నుంచి ఆస్తి పన్నును ముక్కుపిండి వసూలు చేసే మున్సిపాలిటీ మౌలిక వసతులను కల్పించడంపై మాత్రం దృష్టిపెట్టలేదు. ఆస్తి పన్ను రూపేణా వచ్చే నిధులను దారి మళ్లించారు తప్పితే ప్రజల అవస్థలను పట్టించుకోలేదు.

అతిసార కేసులు నమోదు

పట్టణాల్లో అతిసారం కేసులు నమోదవుతున్నాయి. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. గుంటూరు, తెనాలి, పిడుగురాళ్ల పట్టణాల్లో అతిసార వ్యాప్తి చెందిన విషయం తెలిసిందే. పిడు గురాళ్లలో డయేరియా మరణాలు చోటు చేసుకున్నాయి. ఒక వైపు అతిసారం కేసులు నమోదు అవుతు న్నా పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించడంలేదు. వర్షం కురిస్తే పట్టణాలు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పురపాలకులు అప్రమత్తమై ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.



● గుంటూరులో..

రేషన్ లొసుగులు బహిర్గతం



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

- మంత్రి మనోహర్ తనిఖీల్లో వెలుగులోకి
- సరుకుల పంపిణీ వాహనంలో కార్డుల గుట్టలపై ఆగ్రహం
- బియ్యం పంపిణీ కంటే నిల్వలే ఎక్కువపై నాదెండ్ల ఆశ్చర్యం
- వాహనాన్ని వదిలేసి పారిపోయిన ఓ ఎండీయూ ఆపరేటర్

తెనాలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీ వాహనంలోనే గుట్టలుగా కార్డులు.. పంపిణీ చేసిన వాటికంటే వాహనంలో ఉన్న బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.. విక్రయ కేంద్రంలోనూ అదనపు బియ్యం మూటలు, ఇతర సరుకులు.. ఇవన్నీ ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల్లో బహిర్గతమైన విషయాలు. వీటిని చూసిన మంత్రి విస్తుపోయి, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపిన మంత్రి ఆదివారం తన సొంత నియోజకవర్గంలోనూ రేషన్ పంపిణీ తీరును ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మంత్రి తనిఖీల సమాచారం తెలుసుకున్న తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ కూడా పాల్గొన్నారు. మొదట బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లో బియ్యం, కంది పప్పు దుకాణాన్ని పరిశీలించేందుకు మంత్రి వచ్చారు. అయితే ఒక దుకాణం మూసి ఉండటంతో ఆయన మండిపడ్డారు. పైగా సబ్‌కలెక్టర్ ప్రారంభించిన దుకాణం ఎలా ఉందనేది కూడా పరిశీలించరా అంటూ అధికారులపై మండిపడ్డారు. మరో దుకాణంలో నాణ్యమైన బియ్యంతోపాటే తక్కువ రకం బియ్యం ఉండటాన్ని చూసి ప్రశ్నించారు. వ్యాపారి పొంతనలేని సమాధానంతో రెండు దుకాణాలపై విచారణకు ఆదేశించారు. రెండో దుకాణాన్ని మాత్రం సీజ్ చెయ్యాలని ఆదేశించారు. ఆ తర్వాత పినపాడు దగ్గర రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని గమనించిన మంత్రి అక్కడ ఆగారు.

సరుకులు పంపిణీ చేసిన పరిమాణాన్ని పరిశీలించారు. దానిలో పాత కార్డులతోనే రేషన్ పంపిణీ చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిని పరిశీలించాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. మఠంబజార్‌లో రోడ్డుపక్కన ఎండీయూ వాహనం ఉండటం, తలుపులు తెరిచి ఉండటంతో దానిపై అనుమానం వచ్చి పరిశీలించారు. లోపల సంచిలో లబ్ధిదారుల కార్డులు గుట్టలుగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ జరపాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. తనిఖీల సమాచారం తెలిసి ఆపరేటర్ వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లి ఉంటాడన్న కోణంలో పరిశీలించాలని తెలిపారు. మరో వాహనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రైతుబజార్‌లో కూరగాయల ధరలను పరిశీలించారు. అయితే బయట మార్కెట్‌లో కిలో టమోటా రూ.40 ధర ఉంటే, రైతు బజార్‌లో రూ.52కు అమ్మడంపై దుకాణదారుడ్ని, సూపర్‌వైజర్‌ను మంత్రి ప్రశ్నించారు. రిజిష్టర్‌ను పరిశీలించి వ్యత్యాసం ఉండటంతో పనితీరు సరిగాలేదని సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశించారు.



వాహనంలో రేషన్ కార్డుల గుట్టలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

నాసిరకం పనులు.. బిల్లుల కోసం ఒత్తిళ్లు

- 36 అభివృద్ధి పనులపై నివేదిక కోరిన విజిలెన్స్
- బినామీ సంస్థల పేరుతో వైసీపీ కార్పొరేటర్లు, ముఖ్య నేత టెండర్లు
- బిల్లులు చెల్లించాలని అధికారులపై టీడీపీ ఎమ్మెల్యేలతో సిఫార్సులు
- బిల్లులు చెల్లించేందుకు నిరాకరించిన కమిషనర్‌పై తప్పుడు ప్రచారం



శ్రీనివాసరావుతోటలో నాణ్యతా ప్రమాణాలు లేకుండా చేపట్టిన అభివృద్ధి పనులు

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): నాణ్యత లేదు.. ప్రమాణాలు పాటించలేదు. నగరంలో పలు అభివృద్ధి పనులకు బినామీ పేర్లతో టెండర్లు దక్కించుకున్న వైసీపీ కార్పొరేటర్లు, ఓ ముఖ్యనేత తూతూమంత్రంగా పనులు చేశారు. వీటిపై విజిలెన్స్ నివేదిక కోరింది.. ఈ క్రమంలో ఆయా పనులకు బిల్లులు మంజూరు చేయించుకునేందుకు ఏకంగా ఇటీవల నూతనంగా గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేతోనే సిఫార్సులు చేయించుకుంటున్నారు. అయితే నాసిరకం పనులకు బిల్లులు చెల్లించేదేలేదని కమిషనర్ తేల్చిచెప్పడంతో ఆమెపై తప్పుడు ప్రచారానికి కూడా వైసీపీ ముసుగులోని కాంట్రాక్టర్లు సిద్ధమైనట్లు సమాచారం. నగర పాలక సంస్థ పరిధిలో వైసీపీ హయాంలో రూ.6కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నగరానికి చెందిన ఆ పార్టీ ముఖ్య నేత, ఆయన అనుయాయులైన కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యే ఇలా అందరూ కలిసి పంచుకుని పనులు చేశారు. వాస్తవానికి థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు లేకుండానే సర్టిఫికెట్ జారీ చేశారు. బిల్లులు చెల్లించాలని కమిషనర్‌పై కాంట్రాక్టర్లు ఒత్తిడి చేయగా ఆమె నిరాకరించారు. బిల్లులను దక్కించుకునేందుకు వైసీపీ కార్పొరేటర్లు, నగరపాలక సంస్థకు చెందిన ముఖ్య నేత, మాజీ ఎమ్మెల్యే ఒకరు అనేక ప్రయత్నాలు చేశారు.

టీడీపీ ఎమ్మెల్యేల ద్వారా ఫోన్లు

వైసీపీ హయాంలో ముఖ్య నేత రూ.6 కోట్ల బిల్లుల కోసం కమిషనర్‌కు సిఫార్సు చేశారు. అయితే పనులు నాసిరకంగా జరిగాయని బిల్లుల మంజూరుకు ఆమె నిరాకరించారు. ఇటీవల ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయినా బిల్లుల మంజూరు ప్రయత్నాలను వైసీపీ నేత వదల్లేదు. ఈ క్రమంలో ఆ నేత సలహాతో గుంటూరులో ఉండే ఓ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే వద్దకు సంబంధిత కాంట్రాక్టర్లు వెళ్లారు. కమిషనర్‌పై అనేక సాకులు చెప్పారు. వారి చేత కమిషనర్‌కు ఫోన్ కూడా చేయించినట్లు తెలిసింది. అయితే ఆ సమయంలో కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ఎత్తలేదు. తర్వాత కొద్ది సమయానికి కమిషనర్ తిరిగి ఆ ఎమ్మెల్యేకి ఫోన్ చేశారు. ఆ బిల్లుల చెల్లింపులో ఉన్న ఇబ్బందులను కమిషనర్ ఆ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన నిబంధనలు మేరకే చేయాలని సూచించినట్లు తెలిసింది.

కాంట్రాక్టర్లకు మింగుడు పడని కమిషనర్

నగరంలో జరిగిన అభివృద్ధి పనులపై కొందరు కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు సక్రమంగా లేవని రాష్ట్ర విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. 36 పనులపై నివేదిక పంపాలని కమిషనర్‌కు విజిలెన్స్ విభాగం నుంచి లేఖ వచ్చింది. ఈ క్రమంలో పనుల నాణ్యతపై విజిలెన్స్ తేల్చిన తర్వాత బిల్లులు చెల్లించాలని కమిషనర్ అప్పట్లో నిర్ణయించారు. అప్పటి నుంచి కమిషనర్‌పై అక్కసు పెంచుకున్నారు. అప్పట్లో వైసీపీ నాయకుల చేత, ఇప్పుడు టీడీపీ నేతల చేత కమిషనర్‌కు ఫోన్ చేయించి బిల్లులు పొందేందుకు వైసీపీ కాంట్రాక్టర్లు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావడం లేదు. దీంతో కమిషనర్ కాంట్రాక్టర్లకు మింగుడు పడటం లేదు.

ఐదారేళ్ల క్రితం పనులకు బిల్లులు..

ఐదారేళ్ల క్రితం నాటి పనులకు సంబంధించి సుమారు 310కి పైగా బిల్లులను వారం రోజులుగా పెట్టారు. ఆయా బిల్లులను తక్షణం చెల్లించాలని ఇంజనీరింగ్ అధికారులు సిఫార్సు చేశారు. వీటిని కూడా కమిషనర్ కీర్తి పక్కన పెట్టారు. సీ-బిల్స్‌ని ఎక్కడా పెట్టొద్దని గతంలోనే కమిషనర్ ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. అయినా ఇంజనీరింగ్ అధికారులు ఆ బిల్లులు చెల్లించలేదంటూ కమిషనర్‌పై అపవాదు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే 310 బిల్లులకి సంబంధించి ఎస్‌ఈ సంతకాలు లేకుండానే నేరుగా కమిషనర్‌కు పంపారు.



6లో..

తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీమహంకాళీ అమ్మవారి బోనాల జాతరలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సవితతో తెలుగు మహిళలు



నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు

ఆక్వాపార్కుకు 192 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నాం

● నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు, మడ అడవుల పరిశీలన

● కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, జూలై 14: తీరప్రాంతంలో ఆక్వాసాగుకు అన్ని వసతులతో కూడిన 192 ఎకరాల్లో ఆక్వాపార్కు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి అన్నారు. ఆదివారం సూర్యలంక ఆదర్శనగర్ బ్రిడ్జి వద్దనుంచి నిజాంపట్నం హార్బర్ వరకు బకింగ్‌హాం కెనాల్‌లో 14 కిలోమీటర్ల మేర బోటులో కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు పర్యటించారు. నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను, సముద్రం ఒడ్డున మడ అడవులను, హార్బర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నంలో పర్యాటక, ఆక్వారంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వాపార్కుకు భూమిని ప్రభుత్వం కేటాయిస్తే పనులు మొదలుపెడతామని తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 2.5 హెక్టార్ల అటవీభూమిని భూసేకరణ చెయ్యాల్సి ఉందన్నారు.

బాపట్ల జిల్లాలో బీచ్‌ల వద్ద మరణాలు పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే సముద్రతీరప్రాంతాల్లో పర్యటించి అక్కడ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రకృతి విపత్తుల్లో తీర ప్రాంతానికి కంచుకోటగా మడ అడవులు నిలుస్తున్నాయన్నారు. కావున వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మడ అడవులను నరికివేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. జెట్టీల నిర్మాణం పెంపు కొరకు సముద్రంలో బోట్లు రాకపోకలు సాగించేలా మొగ వద్ద పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జర్ల ద్వారా పూర్తిగా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్లజిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్, బాపట్ల ఆర్డీవో ఆర్.రవీంద్ర, నిజాంపట్నం బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 14: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 264 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వ కు 123, పశ్చిమ కాల్వకు 83, నిజాంపట్నం కాల్వకు 187, కొమ్మమూరు కాల్వకు 1005 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు, రేపు ప్రజాదర్బార్ రద్దు

తాడేపల్లి, జూలై 14: వర్షాభావ పరిస్థితుల కారణంగా సోమ, మంగళవారాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. మళ్లీ ప్రజాదర్బార్ జరిగే తేదీని త్వరలో తెలియపరుస్తామని నారా లోకేశ్ కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

● కొనసాగుతున్న గందరగోళం
● పలువురికి ఈ నెలలో ఆగిన వేతనాలు
● కార్యదర్శులకు దక్కని డీడీవో అధికారాలు
● తలనొప్పిగా క్లస్టర్ పంచాయతీల వ్యవహారం

తెగని పంచాయితీ

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ తాలూకా గందరగోళం ఇప్పట్లో తొలగేలా లేదు. గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు, పంచాయతీ బాధ్యతలు అప్పగించినా గత ప్రభుత్వ నిర్వాకంతో అవి వారికి ఎండమావిగానే మారిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ, వార్డు కార్యదర్శుల పేరిట వందల మందిని ఎంపిక చేసి నిర్దిష్టమైన జాబ్ చార్టు ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. దీంతో వారంతా తమకు పంచాయతీ విధులు కేటాయించాలని ఆందోళన చేపట్టడంతో గడిచిన రెండేళ్లలో మూడు సార్లు జీవోలు జారీ చేసింది. కానీ అమలు చేయలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న 'ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి' విధానాన్ని, అందుకోసం తీసుకువచ్చిన జీవో 11ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలను తాజాగా అమలు చేసింది. గ్రేడ్- 5 కార్యదర్శులందరికీ గ్రామ పంచాయతీలను కేటాయించింది. కానీ గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళం కారణంగా వారిలో చాలా మందికి ఆ హోదా ఈరోజు వరకూ దక్కలేదు.

వెంటాడుతున్న క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య

కూటమి ప్రభుత్వం మూడు జిల్లాల్లో 500మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రామ పంచాయతీలు కేటాయించి, డీడీవో హోదా కల్పించింది. కానీ వారిలో చాలా మందికి క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య కారణంగా ఆ హోదా దక్కలేదు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన క్లస్టర్ విధానమే అందుకు కారణంగా తెలుస్తోంది. క్లస్టర్ విధానం కారణంగా 3, 4 మైనర్ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అందులో ప్రధాన పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో లాగిన్లలోకి మ్యాప్ చేశారు. ఆ కారణంగా ఒక మండలంలో 15 పంచాయతీలు ఉంటే, 7, 8 మంది మాత్రమే మ్యాప్ అయ్యారు. మిగిలినవారు ఎంపీడీవో క్యాడర్ పరిధిలోకి రాకుండా పోయారు. ఎంపీడీవో లాగిన్లో మ్యాప్ అయిన కార్యదర్శుల బిల్లులకు మాత్రమే ట్రెజరీ ఆమోదం లభిస్తుంది. ఆ కారణంగా క్లస్టర్ పంచాయతీల్లోని అనేక మంది పంచాయతీ కార్యదర్శులకు ట్రెజరీ శాఖ బిల్లులను ఆపేసింది. దీంతో వారికి ఈ నెల జీతాలు దక్కలేదు. కాగా కొన్ని జిల్లాలో 2, 3 నెలల నుంచి కూడా జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. దీంతో వారంతా పంచాయతీరాజ్ కమిషనర్‌కు గోడు విన్నవించుకున్నారు. ఆయన తక్షణమే స్పందించి ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు లేఖ పంపారు.

క్లస్టర్ గందరగోళం

గతంలో కార్యదర్శుల కొరత కారణంగా ప్రభుత్వం మూడు, నాలుగు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. వాస్తవానికి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉన్న 1200 పంచాయతీలకు 1236 మంది కార్యదర్శులు ఉన్నారు. కార్యదర్శుల కొరత లేని కారణంగా క్లస్టర్ వ్యవస్థని పూర్తిగా రద్దు చేయవచ్చు. క్లస్టర్ ప్రధాన కేంద్రంగా ఉన్న పంచాయతీలను కూడా గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5లకు కేటాయించవచ్చు. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు. గ్రేడ్ -2, 3, 4, 5 పంచాయతీల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు మెరిట్ ప్రాతిపదికన పంచాయతీలు కేటాయించి 'ఒక పంచాయతీకి- ఒక కార్యదర్శి' జీవో 11 పూర్తిస్థాయిలో అమలు చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు.

> **సమస్యను పరిష్కరించండి**
>
> గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. డీడీవో అధికారాలు అందరికీ వర్తింపజేయాలి. క్లస్టర్ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' జీవోను అమలు చేయాలి.
>
> - ముదువర్తి రమేశ్‌బాబు, కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వైభవంగా శ్రీమహంకాళీ అమ్మవారి బోనాల జాతర



మహంకాళీ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఎస్.సవిత



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళా భక్తులు

దుగ్గిరాల, జూలై 14: మండలంలో ప్రసిద్ధిచెందిన కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో తెలుగు మహిళావిభాగం ఆధ్వర్యంలో బోనాల జాతర ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన సుమారు 200 మంది మహిళాభక్తులు అమ్మవారికి పొంగలి నైవేద్యం సిద్ధం చేశారు. మంగళగిరి రూరల్ మండలం టీడీపీ మహిళాధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మాలెంపాటి వెంకటేశ్వరరావుల సౌజన్యంతో బాలికలతో కలిసి తెలుగు మహిళానేతలు, కార్యకర్తలు ఉత్సాహం గా కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు మేళతాళాల మధ్య ఆల యం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని బో నాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైభవంగా జరిగిన బోనాల జాతర భక్తులకు కనువిందుచేసింది. టీడీపీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి రూరల్ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, మంచికలపూడి వైష్ణవి, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, ఎంపీటీసీలు పసుపులేటి సాయిచైతన్య, చిలువూరు మరియరోజమ్మ, తోటకూర సీతారామయ్య, పోలిమెట్ల రత్నగిరిరావు, డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు, గద్దె శ్రీనివాస్, ఆలపాటి శ్రీనివాసరావు, ఆలపాటి రామారావు, జానకీదేవి, నాయుడు సీతయ్య, చిలువూరు శేషగిరి, పినపాటి కరుణాకర్, పేరూరి సత్యనారాయణ, ఇందుపల్లి బాల, మద్దుకూరు శ్రీను పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీమహాకాళీ అమ్మవారి సన్నిధిలో మంత్రి సవిత

శ్రీమహంకాళీ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్.సవిత ఆదివారం దర్శించుకున్నారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం అమ్మవారు లక్షగాజుల అలంకరణతో భక్తులకు కనువిందు చేశారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రి సవితకు అర్చకులు, దేవదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ ఈఓ డీసీహెచ్ వెంకటరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు అమ్మవారి చిత్రపటంతో పాటు ఆషాఢసారెను బహూకరించారు. అర్చకులు తారక్‌నాథ్ శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మణిశర్మలు శుభాశీ ర్వచనం అందించారు.

అభివృద్ధి కారకులనే టీడీపీ ప్రోత్సహిస్తుంది

● ప్రగతిపథంలో పయనిస్తున్న రాష్ట్రం ● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

గుంటూరు, జూలై 14: తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి కారకులను ప్రోత్సహిస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ తాము చేసిన కార్యక్రమాలన్నింటిని గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇకపై అభివృద్ధికి ఎలాంటి అవరోధాలు ఉండవన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాబు మానసపుత్రిక అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయటానికి సన్నాహాలు చేస్తుందన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. త్వరలో అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించి టీడీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపిస్తుందన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్టీఆర్ భరోసా పేరుతో పెంచిన పెన్షన్ మొత్తాన్ని మొదటి నెలలోనే అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు అందజేసిందన్నారు. ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టి, ఇది చేతల ప్రభుత్వం అని నిరూపించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఒక పక్క వ్యవస్థలను గాడిలో పెట్టుడుతూ మరో పక్క రాష్ట్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని లేని రాష్ట్రంగా చిన్నాభిన్నం చేశారన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అమరావతి రాజధానికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి యువతకు భరోసా కల్పించింది. ఎస్సీ , ఎస్టీ, బీసీల కార్పొరేషన్‌లతో పాటు సబ్ ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించి వారి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయితీల నిధులను దారి మళ్లించి సర్పంచ్ లను డమ్మీగా చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు.

15, 16న ఫిరంగిపురంలో కార్మెల్ మాత మహోత్సవాలు



పూజలు అందుకోనున్న కార్మెల్ మాత

ఫిరంగిపురం, జూలై 14: ఫిరంగిపురంలోని కార్మెల్ కొండపై ఈనెల 15, 16 తేదీల్లో కార్మెల్‌మాత ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ ఉత్సవాలలో లక్షలాది మంది భక్తులు పాల్గొని తరిస్తుంటారు. గ్రామంలోని కార్మెల్ కొండపై 1981లో లండన్ మిల్‌హిల్‌కు చెందిన ఫాదర్ థియేటర్ డిక్మన్ దేవాలయాన్ని నిర్మింపచేశారు. అప్పటినుంచి ఆర్‌సీఎం క్రైస్తవ భక్తులతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గురువులు, కన్యా స్త్రీలు, భక్తులు వచ్చి మొక్కు తీర్చుకుంటుంటారు. పండుగలో ఉచితంగా తాగునీరు, భోజన వసతి, ఉండేందుకు సత్రశాలలు ఏర్పాటు చేసినట్టు చర్చి ఫాదర్ పాతిమా మర్రెడ్డి తెలిపారు. 15వ తేదీ ఉదయం కొండమీద పూజ, సాయంత్రం 5గంటలకు దివ్య సత్ప్రసాదం, మరియమాత స్వరూపాలతో భారీ ఊరేగింపు, అనంతరం గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య సందేశం ఉంటుందన్నారు. అదేవిధంగా 16వ తేదీ కార్మెల్ కొండపై సమష్టి దివ్య పూజాబలి ఉంటాయని ఆయన తెలిపారు.

జనసేన కార్యకర్తకు కత్తిపోట్లు



కత్తిపోటు గాయంతో వైద్యశాలకు వస్తున్న ఫయాజ్‌బాషా

తెనాలి రూరల్, జూలై 14 : జనసేన పార్టీ కోసం పని చేశాడని కక్ష పెంచుకుని అతనిని వైసీపీ అరాచక మూకలు కత్తితో పొడిచారు. బాధితుడు, స్థానికులు, కటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్‌బాషా (28) వెండి ఆభరణాలు తయారు చేసే పనిచేస్తుంటాడు. ఇటీవల ఎన్నికల్లో ఫయాజ్‌బాషా జనసేన పార్టీకి మద్దతు తెలిపి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ కూటమి విజయానికి పనిచేశారు. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో జనసేన పార్టీ దిమ్మెను సైతం ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో గ్రామ సెక్రటరీతో దిమ్మెకట్టవద్దని గ్రామ ప్రెసిడెంట్ బాషాకు అడ్డు తగిలే ప్రయత్నం చేయగా అది ఫలించలేదు. దీంతో కక్షపెట్టుకున్న వైసీపీ నాయకులు ఆదివారం ఫయాజ్ బాషా తన అమ్మమ్మ ఇంటికి వెళుతున్న క్రమంలో గ్రామ ప్రెసిడెంట్ వైసీపీ నాయకుడు బాషా, సుభాని, రబ్బాని కలిసి కత్తితో పొడిచారు. దీంతో రక్తగాయాలతో ఉన్న ఫయాజ్‌బాషాను గ్రామస్తులు హుటాహుటిన తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘనటపై పోలీసులు విచారణ చేపట్టారు.

వేగం పుంజుకున్న గూడూరు-విజయవాడ మూడో రైల్వేలైన్ పనులు

తెనాలి క్రైం, జూలై 14: విజయవాడ-గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణ పనులు వేగం పుంజుకున్నాయి. మరో ఏడెనిమిది నెలల్లో ఈ మార్గంలో మూడో లైను అందుబాటులోకి రానున్నదని అధికారులు వెల్లడించారు. గూడూరు-బిట్రగుంట, బిట్రగుంట-కరువది, కరువది-కృష్ణాకెనాల్ మధ్య మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే గూడూరు నుండి చుండూరు రైల్వేస్టేషన్ వరకు మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణలు పూర్తి అయ్యాయి. కరువది నుండి బాపట్ల వరకు మూడో లైనుపై రైళ్ళ రాకపోకలు కొనసాగుతున్నాయి. కరువది-విజయవాడ మధ్య రూ.1046కోట్లతో పనులు సాగుతున్నాయని 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేసి మూడో లైను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్గంలోని మోదుకూరు, స్వూవర్టుపురం, కడవకుదురు, కొత్తపందిళ్ళపల్లి, ఈపూరుపాలెం, జాండ్రపేట, కొలకలూరు, కొలనుకొండ వంటి ఎనిమిది చిన్న స్టేషన్లలో ఫుట్‌బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారాల నిర్మాణాలు పూర్తయ్యాయి. స్టేషన్లు కూడా ఆధునీకరించడం, ప్రయాణికులకు తాగునీరు, తగిన సీటింగ్ వసతి, టాయిలెట్స్ వంటి సదుపాయాలతో పాటు ఆయా స్టేషన్లలో అధునాతన సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే ఈనెల 16నుండి 30వ తేదీ వరకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగనున్నాయని, దీంతో ఈ మార్గంలో నడిచే కొన్ని ట్రైన్స్ పూర్తిగా రద్దు చేయడం, మరికొన్ని దారిమళ్ళించడం, కొన్ని ట్రైన్స్ రీషెడ్యూల్ చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గూడూరు-విజయవాడ రైలుమార్గం ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా మారనున్నదన్నారు. మూడో లైను నిర్మాణం పూర్తి కాగానే నాలుగో లైను నిర్మాణానికి కూడా రైల్వే అధికారులు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తున్నది. దీనికి సంబంధించి ప్రాథమిక అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.





చుండూరు-పొన్నూరు స్టేషన్ల మధ్య జరుగుతున్న విద్యుదీకరణ పనులు, చుండూరు రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ట్రాక్ పనులు

47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ప్రత్తిపాడులోని పౌల్ట్రీఫారంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొన్న రేషన్ బియ్యం

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు కూడా తరలిస్తున్నారు. పేద ప్రజలు వండుకొని తినాల్సిన బియ్యాన్ని కోళ్లకు దాణాగా పెడుతున్నారు. జొన్నలు, సజ్జలు ఇతర ధాన్యాలతో పోల్చితే రేషన్ బియ్యం తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీఫారం యజమానులు కూడా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే ఈశ్వరరావుకు ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలోని బాలాజీ పౌల్ట్రీ ఫారం నిర్వాహకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొని, నిల్వచేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఆ మేరకు ఆయన విజిలెన్స్ అధికారులు, సిబ్బందిని పంపించి బాలాజీ పౌల్ట్రీ ఫారంను మండల రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా అక్కడ 92 బియ్యం బస్తాలపై ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అని ముద్రలు ఉన్నాయి. ఒక్కో బస్తా 50 కేజీల చొప్పున 46.00 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఇవి కాక 5 తెల్ల సంచులలో 1.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉండటాన్ని గమనించారు. పౌల్ట్రీ ఫారంలో మొత్తం 47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. విచారణలో పౌల్ట్రీ ఫారం లీజుదారైన నాగవరపు సురేష్ పౌల్ట్రీ ఫీడ్ ఖర్చు తగ్గించుకొనుటకు, పరిసర గ్రామాలలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వినియోగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 47.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనపరచుకొని, యజమాని నాగవరపు సురేష్‌పై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా స్థానిక రెవెన్యూ అధికారిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ శ్రీనివాసులురెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బరితెగించిన మాజీ ఎంపీ సురేష్ అనుచరులు

తుళ్లూరు, జూలై 14: రాజధాని ప్రాంతంలో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు, బంధువుల ఆగడాలు ఆగటం లేదు. మోదులింగాయపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి ఉద్దండ్రాయునిపాలెం లంకలోకి ఆదివారం కూలీలకు భోజనం తీసు కుని వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎంపీ అనుచరులు కరకట్ట మార్గంలో బైకులు అడ్డంగా పెట్టారు. బురదగా ఉంది దారి వదలమని శ్రీనివాసరావు వారిని కోరాడు. దాంతో రెచ్చిపోయిన ఎంపీ అనుచరులు శ్రీనివాసరావును చితక బాదారు. ఈ ఘటనపై బాధితుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసినట్టు తుళ్లూరు సీఐ-2 అనురాధ తెలిపారు.

పెదకాకాని మల్లేశ్వరుని సన్నిధిలో రాజధాని రైతులు

● పాదయాత్రగా వచ్చిన రాజధాని మహిళలు, రైతులు

● స్వాగతం పలికిన పెదకాకాని మండల టీడీపీ నాయకులు



పాదయాత్రగా వచ్చిన రాజధాని రైతులకు, మహిళలకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పెదకాకాని, జూలై 14: రాజధాని మహిళా రైతులు అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని కోరుతూ 1600 రోజులుగా దీక్షలు చేపట్టారు. వారి దీక్షలు ఫలించి ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయి అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉంటుందని, రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజధాని మహిళలు పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి మొక్కుబడి కోసం ఆదివారం పాదయాత్రగా బయలుదేరి పెదకాకాని సెంటర్‌కు చేరుకున్నారు. వారికి పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా రైతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజధాని రైతులు చేసిన త్యాగాలు చూసిన ఆంధ్రప్రదేశ్ ఓటర్లు రాష్ట్రంలో కూటమి అధికారంలోకితెచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు నియోజకవర్గం తెలుగుయువత అధ్యక్షుడు మేడ వెంకటకృష్ణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, పెండ్యాల నాగేశ్వరావు, యడ్లపల్లి మధు, షేక్ మజాహర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, జూలై 14: ట్రైన్ నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. తెనాలి రైల్వే పోలీసుల కథనం మేరకు.. తెనాలి-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం 60-65సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ట్రైను నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడిపై తెల్లషర్టు ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని, జూలై 14: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. తక్కెళ్ళపాడు అడ్డరోడ్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, వాహనదారుడికి తీవ్రగాయాలు అయ్యాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జీవీ ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతున్న టీడీపీ నేతలు

జీవీ ఆంజనేయులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● టీడీపీ నేతలు

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రెండు శతాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్న జీవీ ఆంజనేయులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టీడీపీ నేత బోడేపూడి సుబ్బారావు కోరుకున్నారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదినం సందర్భంగా గుంటూరులో టీడీపీ నేతల ఆధ్వర్యంలో వనమహోత్సవం జరిగింది. టీడీపీ నేత బోడేపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో వికాస్‌నగర్ మూడోలైనులో మొక్కలు టీడీపీ నేతలు గంగినేని గురుస్వామి, ప్రత్తిపాటి ప్రసాద్, మొక్కపాటి రవీంద్రబాబు, గంగినేని వెంకట రామారావు, వజ్జా వీరాంజనేయులు, పాపసాని నాగేశ్వరరావు, గమిడి కోటేశ్వరరావు, మలినేడు బుజ్జి, బుచ్చిబాబు, రామినేని లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పార్టీని ముందుకు నడిపి సార్వత్రిక ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు సహా పార్లమెంటు నియోజకవర్గం గెలిపించిన గొప్ప నాయకుడు జీవీ ఆంజనేయులు అని కొనియాడారు. పల్నాడు తరపున ప్రజల ఆకాంక్షగా ఉన్న జీవీ ఆంజనేయులుకు చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవి ఇచ్చి గౌరవించాలని ఆకాంక్షించారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు గుంటూరులో ఉంటున్న వినుకొండవాసుల సమక్షంలో కూడా వనమహోత్సవాన్ని చేపట్టామన్నారు. చంద్రబాబు సహకారంతో వినుకొండను అభివృద్ధి పథంలో నడిపించాలని సుబ్బారావు కోరారు.



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు, పక్కన నాసర్‌జీ తదితరులు

మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు

గుంటూరు(తూర్పు), జూలై 14: గత ఏడాది నవంబరు నుంచి మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయలేదని దీంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు అన్నారు. ఆదివారం గుంటూరు, కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనేకమార్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు వసతి గృహాల్లో హాస్టల్ నిద్ర కార్యక్రమం తలపెట్టినట్టు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెం 77ను రద్దు చేస్తానని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్ దుర్గాసాయి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, నోట్ పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాథోడ్ సుజాన్‌సింగ్

గుంటూరు (మెడికల్) జూలై 14: బొందిలి సంక్షేమసేవా సమాజ్ ఆధ్వర్యంలో కొత్తపేట విజయా టాకీస్ సెంటర్‌లో గల శ్రీసదాశివ టైప్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ప్రతిభ గల పేద బొందిలి విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొందిలి సంక్షేమ సేవాసమాజ్ అధ్యక్షుడు రాథోడ్ సుజాన్‌సింగ్, 120 మంది విద్యార్థులకు పుస్తకాలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సింగ్, శ్రీనివాస్‌సింగ్, నరేంద్రనాథ్ సింగ్, రూప్‌సింగ్, బాలాజీసింగ్, శంకర్‌సింగ్, లాలాప్రసాద్, నిర్మల్‌సింగ్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

గుంటూరు (మెడికల్): కొత్తపేటలోని హనుమాన్ ఆదర్శ సేవాసమితి కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వెంకట సుబ్రహ్మణ్యం, ప్రకాష్, శివరావు, మురళీసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆహార మార్పులతోనే లివర్, జీర్ణకోశ వ్యాధులు

గుంటూరు, జూలై 14: ప్రస్తుతం అత్యధిక స్థాయిలో విస్తరిస్తున్న లివర్, జీర్ణకోశ వ్యాధులకు ఆహార వ్యవహారాల్లో మార్పులు, వాతావరణ కాలుష్యం కారణమవుతుందని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు వైద్యుడు డాక్టర్ వీరేంద్ర యశస్వి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, హుస్సేన్, వీవీ రావు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

అలరించిన హిందీ సినీ గీతాల విభావరి



పి.రామచంద్రరాజును సత్కరిస్తున్న కళాకారులు

గుంటూరు(తూర్పు), జూలై 14: స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సమర్పణలో గీతాంజలి ఆర్కెస్ట్రా సంస్థ నిర్వాహకుడు అమ్మపండు ఆధ్వర్యంలో ఏ షామ్ మస్తానీ-15 పాత హిందీ సినీ గీతాల కార్యక్రమం ప్రేక్షకులను అలరింపజేసింది. గాయనీ గాయకులు అమ్మపండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, మానస, సింధు, కల్యాణ్, విజయ్ సాయి, శ్రీనివాసరావు, లలిత(పాడుతాతీయగా) హిందీ పాత చిత్రాల్లోని పాటలను ఆలపించారు. అనంతరం 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమానికి అండగా నిలబడిన ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్ర రాజును గీతాంజలి కళాకారులు ఘనంగా సత్కరించారు.

ఎయిమ్స్ వద్ద అంబులెన్స్ స్టాండ్ ఏర్పాటు

మంగళగిరి, జూలై 14: మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబులెన్స్ స్టాండును ఏర్పాటు చేశారు. ఈ స్టాండును విజయవాడ మాజీ కార్పొరేటర్, నగర సీపీఐ కార్యదర్శి జీ కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, జెడ్ సుధీర్, విజయ్‌కుమార్, కే దుర్గాప్రసాద్, కే ఆశీర్వాదం, జీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మంగళగిరి సిటీ, జూలై 14: మండల పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ గొడవల్లో పాల్గొన్నట్టు తెలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

తాడికొండ, జూలై 14: కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారి సహకారంతో తాడికొండలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. క్యాంపులో ఈసీజీ, షుగర్, బీపీ, జనరల్ మెడిసన్, ఎముకలకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, ధనేకుల హరిబాబు, షేక్ రఫీ, ఫజల్, నస్నేషా, మిక్కిలి కిరణ్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో వీడని ముసురు

● రోజంతా పలు దఫాలు కురుస్తూనే ఉన్న వర్షం
● రోడ్లన్నీ జలమయం.. తటాకాలుగా పల్లప్రాంతాలు
● చిరు వ్యాపారులకు తొలగని కష్టాలు



కేవీపీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 14: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా గుంటూరు నగరంలో వర్షం కురుస్తూనే ఉంది. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది.. పలు దఫాలుగా జలుబు జల్లులు



సదాశివ నగర్ మెయిన్ రోడ్డులో..

పడుతూ.. నగరాన్ని తడిసి ముద్ద చేసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై కొచ్చింది. దీంతో ప్రజలు రోడ్లపైన ప్రయాణించేందుకు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని ఏటి అగ్రహారం, శ్యామలనగర్, వికాస్‌నగర్, విద్యానగర్, ఏపీకాలనీ, రెడ్డిపాలెం ప్రధాన రహదారి ఇలా అనేక ప్రాంతాల్లో వర్షాల తాకిడికి రోడ్లపై నీరు వచ్చాయి. రోడ్లపైన నీటిని కాలవల్లోకి మార్చాలని నగర ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్యామలనగర్ 0 లైన్‌లో రోడ్డుపైకి వచ్చిన వర్షపు నీరు

పరుగు, జీవితం రెండూ ఒక్కటే : ఎమ్మెల్యే మాధవి



5కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పరుగు, జీవితం రెండు ఒక్కటేనని, ముందుకు సాగిపోవాలే కానీ, ఆగిపోకూడదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. డీఎస్ఐ సంస్థ ఆదివారం నిర్వహించిన 5కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5కే రన్ నవభారత్‌నగర్ నుంచి విద్యానగర్ కొరిటెపాడు, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల మీదుగా నవభారత్ నగర్‌కు చేరుకుంది. అనంతరం బెలూన్లను గాలిలోకి వదిలి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగస్వామ్యమైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఎవరి ఆరోగ్యం వారి చేతిలో ఉంటుందని, మెడిసిన్‌కు దూరంగా ఉండాలంటే వాకింగ్, రన్నింగ్, యోగా చేయడం ఉత్తమమైన మార్గమన్నారు. మితమైన ఆహారం తీసుకోవడం, వ్యాయాయం చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు, ఉత్సాహంగా జీవితం సాగిపోతుందని ఆమె తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే గల్లా మాధవి భరోసా

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే గల్లా మాధవి భరోసానిచ్చారు. గుంటూరులో జరిగిన 5కే రన్ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళుతున్న ఆమెకు మార్గం మధ్యలో పారిశుధ్య కార్మికులు కనిపించారు. వారిని చూసి కారు ఆపి పలకరించారు. వారి బాగోగులు తెలుసుకున్నారు. తగినంత మంది సిబ్బంది లేకపోవటంతో పనిభారం మొత్తం ఇతర సిబ్బంది మీద పడుతుందని చెప్పండంతో ఆ సమస్యకు పరిష్కారం చూపుతానని ఆమె వారికి హామీ ఇచ్చారు. ఆమె వెంట కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరావు, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీవో విడుదల చేయాలి

● వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 14: మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన పెండింగ్ జీవోలు వెంటనే జారీ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వెహికల్ షెడ్ విభాగం కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు గురించి 9మంది అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారని అన్నారు. అధికారుల కమిటీ నివేదిక రాష్ట్ర ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని, వెంటనే ఆ కమిటీ నివేదికను ఆమోదించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మున్సిపల్ కార్మికులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బి.ముత్యాలరావు, పూనేపల్లి శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, కె.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సముచిత స్థానం

● పీఏఎస్ కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న పీఏఎస్ కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ, సభ్యుడు నర్రా బాలకృష్ణ

పెదనందిపాడు, జూలై 14: అంకిత భావంతో పనిచేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందని పీఏఎస్ కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ అన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో స్టోర్ కీపర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన శాఖమూరి సుబ్బారావుకు ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు 44 సంవత్సరాలుగా స్టోర్ కీపర్‌గా, కెమిస్ట్రీ ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా, అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేసి విద్యార్థులకు ఎనలేని సేవలందించారన్నారు. అనంతరం కళాశాల పాలకవర్గ సభ్యులు సుబ్బారావు, విజయలక్ష్మీ దంపతులను ఘనంగా సత్కరించారు. పదవీవిరమణ పొందిన సందర్భంగా కళాశాల అభివృద్ధికి శాఖమూరి సుబ్బారావు రు.50వేలు విరాళంగా అందజేశారు. విశ్రాంత విద్యుత్ డీఈ మిక్కిలినేని మోహనకృష్ణ కళాశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన ఐదుగురు పేద విద్యార్థులకు రు.5వేలు చొప్పున ప్రతి ఏటా అందించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, లావు ఆదిశేషయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నర్రా బాలకృష్ణ, నర్రా వీరయ్య, మాదల వెంకటేశ్వరరావు, కొల్లా సుబ్బారావు, ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, విశ్రాంత డీఈ మిక్కిలినేని మోహనకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు కె.సింగారావు, కె.శివన్నారాయణ, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు, శాఖమూరి కృష్ణారావు, చెంచుబాబు, సునీల్, వామనామూర్తి, చెంచులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు విధుల్లో చేరనున్న ఎస్పీ

గుంటూరు, జూలై 14 : జిల్లా ఎస్పీగా నియమితులైన ఎస్ సతీష్ కుమార్ మంగళవారం విధుల్లో చేరనున్నారు. బాపట్ల ఎస్పీగా నియమితులైన తుషార్ డూడీ కూడా అదేరోజు రిలీవ్ కానున్నారు. ఆయా ఎస్పీలు విధుల్లో చేరే విషయమై జిల్లా అధికారులకు సమాచారం అందింది.

కార్యాలయాల వద్ద ఇసుకను వినియోగించాలి

తుళ్లూరు, జూలై 14: తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంఈవో కారాలయాల ముందున్న ఇసుక నిల్వలను వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది, ఎస్ఈబీ పోలీసులు వైసీపీ ప్రభుత్వంలో స్వాధీనం చేసుకున్న అక్రమ ఇసుకను ఆయా కార్యాలయాల ముందు నిల్వ చేశారు. పక్కనే వాగు ఉండటంతో అందులో ఇసుక కలిసిపోయి ఎవరికి ఉపయోగం లేకుండా పోతుందని అంటున్నారు. అంతేకాకుండా ఇసుక గుట్టలు జారి కార్యాలయాలకు వెళ్లే మార్గంలో పడుతుండటంతో బైకుపై వచ్చే వారు ప్రమాదం బారిన పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు ఇసుకను తరలిస్తుంటే పట్టుకొని కార్యాలయాల ముందు దిగుమతి చేసి వాహనాలను సీజ్ చేశారు. దాదాపు వంద ట్రక్కుల ఇసుక నిల్వ ఉంటుందని అంచనా. ఈ ఇసుకను వినియోగంలోకి తేవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

స్వాధీనం చేసుకున్న పీడీఎఫ్ రైస్ మిల్లుకు తరలింపు

వట్టిచెరుకూరు, జూలై 14: మండలపరిధి చమళ్ళమూడి గ్రామంలోని పద్మజా రైస్‌మిల్లులో శుక్రవారం టీడీపీ నాయకుల ప్రత్యేక నిఘాలో పీడీఎఫ్ రైస్ మాఫియా గుట్టురట్టయిన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు సివిల్ సప్లయ్ డీటీ పద్మజ, ఆర్ఐ శివ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఎన్ నాగరాజు, అరెకపూడి మురళీ సాంబశివరావు, గోపి రైస్‌మిల్లు ప్రాంగణంలోనే మకాం వేసి మిల్లులో విడిరాసుల్లో ఉన్న పీడీఎఫ్ రైస్‌ను గోతాలకు ఎత్తి పలు దఫాలుగా పూర్తి బందోబస్తుతో గుంటూరు నగరంలోని పరమాయగుంట ప్రాంతంలోని రైస్‌మిల్లుకు చేర్చి భద్రపరుస్తున్నారు. మిల్లు యజమాని ఇంకా పరారీలోనే ఉన్నా డు.

28 మద్యం సీసాలు స్వాధీనం

తాడికొండ, జూలై 14: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళ నుంచి 28 సీసాల మద్యంను శనివారం రాత్రి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు గ్రామానికి మేడిద రమణ మద్యం అక్రమంగా విక్రయిస్తుంది. విషయం తెలుసుకున్న మంగళగిరి సెబ్ అధికారులు ఆమె ఇంటిపై దాడిచేసి 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ తుళ్లూరు మండల కమిటీ ఎన్నిక

తుళ్లూరు, జూలై 14: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ నియామకం ఆదివారం జరిగిందని జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు కార్యదర్శులుగా ఎన్ గోపిచంద్, బి.బాబు, ఉపాధ్యక్షుడిగా ఎన్ హర్షవర్ధన్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సదర్భంగా కిరణ్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉచితంగా సీట్లు కేటాయించాలని ఆ నిబంధనతోనే రైతుల దగ్గర భూములు స్వీకరించారని గుర్తు చేశారు. నేడు బీటెక్ కౌన్సెలింగ్ జరుగుతున్న తరుణంలో ఇక్కడున్న విట్ ఎస్ఆర్ఎం, అమృత యూనివర్శిటీల్లో పది శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ఆన్‌లైన్ అప్లికేషన్ వల్ల ఎక్కువ మంది విద్యార్థులు నష్టపోతున్నారని, ఆ ప్రక్రియను రద్దు చేయాలన్నారు. తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో స్కూల్స్, కాలేజీలు అభివృద్ధి చేయాలని కోరారు. ఇంకా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి రాలేదన్నారు. అధికారులు చొరవ చూపాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మంగళగిరి, జూలై 14: భారత విద్యార్థి ఫెడరేషన్ మంగళగిరి కమిటీని ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎం సాయి, కార్యదర్శిగా పఠాన్ సమీర్, ఉపాధ్యక్షుడిగా అహమ్మద్, ఇమ్రాన్, సహాయ కార్య దర్శులుగా శరత్, దేవా, మరికొంత మందితో నూతన కమిటీని ఎన్నుకు న్నట్టు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందని చెప్పారు. మంగళగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, పీజీ అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో జీవో నెం.77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు ఎం బాలాజీ, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే.. రెటినోపతితో చూపు కోల్పోతారు

గుంటూరు (మెడికల్) జూలై 14: మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే డయాబెటిస్ రెటినోపతి ద్వారా చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నేత్రవైద్య నిపుణులు రాచపల్లి కల్పనారెడ్డి తెలిపారు. ఆదివారం బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో జరిగిన రెటినోపతి ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. షుగర్ శాతం అసాధారణ స్థాయికి చేరితే రెటినా లో సూక్ష్మరక్త నాళాలు సన్నబడి, బలహీనపడి, కొవ్వు పదార్థాలు పేరుకుపోయి కంటి చూపు తగ్గుతుందని డాక్టర్ కల్పనారెడ్డి తెలిపారు. రెటినోపతిని తొలి దశలో గుర్తించేందుకు ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని, సమస్యను గుర్తిస్తే దానికి తగిన విధంగా వైద్యచికిత్సలు అందిస్తామన్నారు. అనంతరం రోగులకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్, మానవతా స్వచ్ఛంధసేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే సతీష్‌బాబు, కోశాధికారి టీవీ సాయిరాం, సీహెచ్ శివాజీ, సీ లక్ష్మీ, డీ సుధాకర్, జోస్నారెడ్డి, టీ కృష్ణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీ వర్మ రచనలు ఆలోచనాత్మకం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 14: ఏవీ వర్మ రచనలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏవీ వర్మ రాసిన 'ఎర్రజెండా నీడలో.. నా అనుభవాలు' పుస్తకాన్ని వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సీపీఎం పల్నాడు జిల్లా నాయకులు నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక సూక్ష్మమైన అంశాలు సామాన్య కార్యకర్తల రచనల ద్వారా వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వర్మ జీవితం కమ్యూనిజంతో ముడిపడి ఉందన్నారు. ఆయన అనుభవాలు నేటి తరానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాశం రామారావు, కే ధనలక్ష్మీ, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ బ్రహ్మానందరెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావుతో పాటు వర్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జీపీఎస్ రాజపత్రాన్ని రద్దు చేయాలి : ఏపీటీఎఫ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య), జూలై 14: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షకు వ్యతిరేకంగా బలవంతంగా తీసుకొచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్)ను రాజపత్రం ద్వారా అమలు చేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, వెంటనే గజెట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ముఖ్యనాయకుల సమావేశంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకుండా లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసి, వారి ఆకాంక్షలకు విరుద్ధంగా ఉద్యోగులకు ఏమాత్రం గ్యారెంటీ, రక్షణ లేని జీపీఎస్‌ను బలవంతంగా తీసుకొచ్చారని, ఏపీటీఎఫ్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని సంఘాలు వ్యతిరేకించినప్పటికీ జీవో 54ను జూన్ 2024న తెచ్చారన్నారు. 12న జీపీఎస్‌ను అక్టోబర్ 2023 నుంచి అమలుపర్చే విధంగా ఏకంగా గజెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ, ఉద్యోగులను ఆందోళనకు గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ఎస్ మూర్తి, జిల్లా కౌన్సిలర్లు పచ్చల శివ రామకృష్ణ, కోటేశ్వరరావు, సుబ్బారావు, కుటుంబరావు, శ్రీనివాస మూర్తి, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామయ్య హైస్కూల్లో ముగిసిన లెర్నింగ్ శిక్షణ



పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 14: పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో రెండు రోజులుగా సీబీఎస్ఈ రీజినల్ ఆఫీస్, సీవోఈ విజయవాడ ఆధ్వర్యంలో ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ శిక్షణ తరగతు లు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి రిసోర్స్ నిపుణులు వివా స్కూల్ ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, అకడమిక్ డైరెక్టర్ తాడేప ల్లిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ ఎన్ ఉమా శ్రీనివాస రావులు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి బ్లూమ్స్ టాక్సాన మి పద్ధతితో ఆర్కా, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, మల్టిపుల్ ఇంటిలిజెన్స్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సభలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మా ట్లాడుతూ మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు మార్చుకునేలా సీబీఎస్ఈ సీఓఈ వారు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎందరో విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలా మారుతుందని అన్నారు. తమ విలువైన సమయాన్ని తమ పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్స్‌కు ధన్యవాదాలు తెలియచేసారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సయ్యద్ జవహర్, అకాడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ శ్రీదుర్గాశ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీవారి కొండకు చేరిన రాజధాని మహిళలు, రైతులు



తిరుమల మెట్ల మార్గం ముఖ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న రాజధాని అమరావతి మహిళలు, రైతులు

తుళ్లూరు, జూలై 14: ఎన్డీఏ కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో రాజధాని రైతులు, మహిళలు 30 మంది వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి కృతజ్ఞత పాదయాత్ర చేస్తూ తిరుమల శ్రీవారి కొండ చేరుకున్నారు. పాదయాత్ర 20వ రోజు ఆదివారం మెట్ల మార్గం ద్వారా కాలి నడకన కొండపైకి చేరుకున్నారు. రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు మెట్ల మార్గం ముఖ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి కొండపైకి నడకను ప్రారంభించారు. సోమవారం వారు శ్రీవారిని దర్శించుకోవటానికి టీటీడీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.



దిక్సూచి DIKSUCHI

కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతవైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్' (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన

- **'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),**
- **'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),**
- **'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)**లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూతన చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ



భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023

జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

దిశలు - దూరాలు

● రీజనింగ్

పార్ట్-2

ముఖ్యరేఖాచిత్రం

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం


1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:

R- బయలుదేరినస్థానం (ఇల్లు)
S- చేరుకొనినస్థానం (పాఠశాల)




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



I- మొదటి కారు
II- రెండవ కారు

పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:



G- బయలుదేరిన స్థానం
H- చేరుకొనిన స్థానం


బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమర సి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.



ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచనప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరోసారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్కం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్కం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మోంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



తెరుచుకున్న జగన్నాథుడి రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్కపెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్క పెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గది లోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, అర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి

తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రెటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.


వెంకట్రావుకు జ్ఞాపికను అందించి, సత్కరిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

సమాజసేవలో కమ్మవారు ముందుండాలి

● కాకతీయ సేవాసమాఖ్య ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

తెనాలి రూరల్, జూలై 14: సమాజ సేవలో కమ్మవారు మరింతగా ముందుండాలని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని చావాస్ కళ్యాణమండపంలో తెనాలి నియోజవర్గ కమ్మ సమాఖ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బెజవాడ వెంకట్రావు స్థానిక కమ్మ సంఘ నాయకులతో కలిసి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గానికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన మహనీయులు దివంగత త్రిపురనేని రామస్వామి, వెలగపూడి రామకృష్ణ, ముత్యాల రాజ, కాకాని వెంకటరత్నం, నార్ల తాతారావు వంటి వారి అడుగుజాడల్లో నడుస్తూ సమాజంలో మరింత పేరు ప్రఖ్యాతలు గడించాలని కోరారు. రాష్ట్ర సమాఖ్య ప్రతినిధులు కొర్రపాటి అయోధ్యరామారావు, వెలగా కోటేశ్వరరావు, కర్నాటి శ్రీనివాస చక్రవర్తి, పర్చూరు శ్రీనివాసరరావు, తెలంగాణ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు బొడ్డు రవిశకంర్‌రావు, గ్రేటర్ విజయవాడ సంఘ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణ, మురళి, స్థానిక సంఘసభ్యులు అన్నాబత్తుని సదాశివరావు, బీఎల్ కాంతావు, విశ్రాంత ఎండీవో కనకమేడల కుసుమకుమారి, సూరపనేని కల్పన తదితరులు సభనుద్దేశించి ప్రసంగించారు. ఈదర శ్యాంప్రసాద్ సంఘానికి రూ.25లక్షలు విరాళం ప్రకటించారు. ప్రముఖ వ్యాపారులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, కొత్త సుబ్రహ్మణ్యం, ఈదర శ్యాంప్రసాద్, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలపాటి వెంకట్రామయ్య, పాలడుగురాజశేఖర్, డాక్టర్ కొమ్మినేని రమేష్‌బాబు, ఈదర వెంకటపూర్ణచంద్, అన్నాబత్తుని సదాశివరావు, పుష్పకుమారి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, కృష్ణ, గూడూరు వెంకట్రావు, తదితరులు పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో నియోజవర్గ కమ్మ సామాజిక కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతిగా మంత్రి మనోహర్

● వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూలై 14: పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తానని వైసీపీ ప్రగల్భాలు పలికి చివరికి రేషన్ మాఫియాకు తెరలేపింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పౌరసరఫరాలశాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ నిరంతరం పనిచేస్తూ పేదల పక్షపాతిగా వారికి నాణ్యమైన రేషన్ సరుకులు అందించాలన్న లక్ష్యంతో ముందుకుసాగుతూ ఆ పదవికి వన్నెతెస్తున్నారని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుల వీరవల్లి మురళి అన్నారు. గతంలో నిత్యవసరాల ధరలు పెంచి పేదల నడ్డివిరిచింది వైసీపీ ప్రభుత్వమైతే అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యుడికి అందుబాటులోలేని కందిపప్పు, బియ్యం వంటి నిత్యవసరాలను సబ్సిడీతో అందించేలా స్టాల్స్ ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం నాదెండ్ల మనోహర్ అన్నారు. రానున్న రోజుల్లో మనోహర్ నాయకత్వంలో తెనాలి ప్రాంత అభివృద్ధి శరవేగంగా జరగనుందని ఓ ప్రకటన ద్వారా మురళి పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 14: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం సభ్యులు అన్నదానం చేశారు. స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం ఎస్‌వీ యోగా సభ్యుడు గరికిపర్తి కాశీదేవర 7వ వర్ధంతి సందర్భంగా వారి తల్లి సునీత, కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను అందజేసి, ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, టి.శంకర్, శ్రీనివాస్, అనూష, వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరావు, మురళి, భారతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు గ్రామోత్సవంగా వెళుతున్న భక్తులు

దుర్గామల్లేశ్వర స్వామివారికి బోనాలు

తెనాలి రూరల్, జూలై 14: మండలంలోని కఠెవరంలో కొలువుదీరి ఉన్న దుర్గామల్లేశ్వరస్వామివారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆషాడమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం గ్రామంలోని మహిళలు బోనాలను తలపై పెట్టుకుని కనత ప్పెట్లతో గ్రామోత్సవంగా తిరుగుతూ ఆలయానికి చేరకుని స్వామివార్లకు సమర్పించారు. ఆలయ ధర్మకర్త జె.వెంకటేశ్వరరావు, ఆలయ పూజారులు దక్షిణరాజు, మణికంఠవర్మ, బాచి, జగదీష్, పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూలై 14: ప్రజల కోసం ఆవిర్భవించిన పార్టీ జనసేన పార్టీ. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జనసేన పీఏసీ ఛైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ జనసేన పార్టీ నియోజవర్గస్థాయి నాయకులతో, వీరమహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై చర్చించారు. పలువురు జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐఎంఏలో సీఎంఈ ప్రోగ్రాం


సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ శశిభూషణ్

తెనాలి, మారీసుపేట జూలై 14: స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆదివారం నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని చందన నర్సింగ్ హోమ్, గుంటూరుకు చెందిన డాక్టర్ శశిభూషణ్ నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువులలో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ శిశువులలో వచ్చే సమస్యలను ముందుగా గుర్తించినట్లైతే వారిని అనారోగ్య సమస్యలను నుంచి కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్‌లు మధుప్రభాకర్‌బాబు, జి.నరసింహారావు, కోటినాగయ్య భానుప్రసాద్, శేషగిరిరావు, గిరిజ, సరోజిని, నీలిమ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ వద్ద అంబులెన్స్ స్టాండ్ ఏర్పాటు

మంగళగిరి, జూలై 14: మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబులెన్స్ స్టాండును ఏర్పాటు చేశారు. ఈ స్టాండును విజయవాడ మాజీ కార్పొరేటర్, నగర సీపీఐ కార్యదర్శి జీ కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పా ల సత్యనారాయణ, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, జెడ్ సుధీర్, విజయ్‌కుమార్, కే దుర్గాప్రసాద్, కే ఆశీర్వాదం, జీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

తాడికొండ, జూలై 14: కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారి సహకారంతో తాడికొండలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. క్యాంపులో ఈసీజీ, షుగర్, బీపీ, జనరల్ మెడిసన్, ఎముకలకు సంబం ధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, ధనేకుల హరిబాబు, షేక్ రఫీ, ఫజల్, నస్నేషా, మిక్కిలి కిరణ్, డాక్టర్లు పాల్గొన్నారు.

హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్యామ్

తెనాలి అర్బన్, జూలై 14: ఏపీ స్టేట్ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జంగం శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన యూనియన్ ఎన్నికల్లో ఈ పదవికి ఆయనను ఎన్నుకున్నారు. తెనాలిలో నివసిస్తున్న ఆయన కొల్లిపర మండలంలో డీపీఎంవోగా పని చేస్తున్నారు.

రైతుబజార్‌లో ధరలు ఎందుకు పెరిగాయి..?

● మార్కెట్లో సబ్సిడీ స్టాల్స్ తెరవకపోవడంతో ఆగ్రహం
● రైతుబజార్లలో ప్రజలకు మేలు జరిగేలా చూడాలి
● అపరిశుభ్ర వాతావరణం ఉంటే సహించేదిలేదు
● పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


తోపుడు బండి వద్ద కూరగాయల ధరలు తెలుసుకుని ఆమె యోగక్షేమాలు విచారిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, జూలై 14: ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటుధరలకు అందించాలన్న మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసినవి రైతుమార్కెట్లలో బయటి ధరలకన్నా ఎక్కువ ధర పలుకుతుండటంపై మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెనాలిలో ఆయన ఆకస్మికంగా రైతుమార్కెట్లు ఇతర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తెనాలిలోని బుర్రిపాలెంరోడ్డులో రత్నాటాకీస్ వద్ద గల రైతుబజార్‌ను సందర్శించారు. పలువురు వినియోగదారులతో మాట్లాడారు. నాణ్యమైన కూరగాయలు అందుతున్నాయా.. సబ్సిడీతో అందించే బియ్యం, కందిపప్పు సద్వినియోగం చేసుకుంటున్నారా.. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్లోని ధరల పట్టికలను పరిశీలించారు. అంతకుముందు మార్కెట్ బయట ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను విచారించి కూరగాయల ధరలు అడిగి తెలుసుకున్నారు. రైతు మార్కెట్లో ధరలకు బయట ధరలకు వ్యత్యాసాన్ని గమనించారు. టమోటా బయట రూ.35-40 ఉంటే మార్కెట్లో దాదాపుగా రూ.50 వరకూ ఉంది. దీనిపై మార్కెట్లో దుకాణ నిర్వాహకులను ప్రశ్నించారు. ఎందుకు ధరలు పెంచి అమ్ముతున్నారు. ఆదివారమని ఇలా చేశారా.. లేక రోజు ఇదేవిధంగా జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రాయితీతో కూడిన బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మార్కెట్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్ మూసి ఉండటాన్ని గుర్తించారు. వినియోగదారులకు అందుబాటులో ఉండాల్సిన స్టాల్ మూసి ఉండటమేంటని ప్రశ్నించారు, పేదలకు మంచి జరిగే విధంగా సబ్సిడీతో అందించేలా ఏర్పాటు చేసిన దుకాణాలు మూసి ఉంచితే దళారి వ్యవస్థకు చేతులిచ్చిన వారిమవుతామని ఇకపై ఇలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్లో ధరలపై నిర్వాహక అధికారిని పిలిచి ధరలు పెంచి అమ్మడంపై ఆగ్రహవ్యక్తం చేశారు. బయటి కంటే మార్కెట్లో ధరలు పెరిగి ఉంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బయట ధరలు చూసిన ప్రజలు మార్కెట్ ధరలు చూస్తే ప్రభుత్వాన్ని తప్పుపట్టకుండా ఉంటారా.. మేం ప్రజలకు మంచి చేయాలని సబ్సిడీతో స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటే మీరేందుకు బాధ్యతగా వాటి నిర్వహణ చూడటంలేదని ఆగ్రహవ్యక్తం చేశారు. ఉద్యోగం బాధ్యతగా చేయలేకపోతే తప్పుకోవచ్చని దీనిపై అధికారులు విచారించాలని ఆదేశించారు. అనంతరం మార్కెట్ సమీపంలో ప్రధాన రోడ్డుపై కుళ్లిన కూరగాయలు ఇతర వ్యర్థాలతో ఉండటాన్ని గుర్తించి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వర్షాలు పడుతున్నాయి. ప్రజలు ఎక్కువగా మార్కెట్ వంటి ప్రాంతాలకు వస్తుంటారు. ఇలా అపరిశుభ్ర వాతావరణం ఉంటే ఆరోగ్యవంతులుగా తిరగగలరా అని ప్రశ్నించారు. బాధ్యతగా వ్యవహరించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని పాండురంగపేటలో రేషన్ పంపిణీ జరిగే తీరును పరిశీలించారు. మొబైల్ రేషన్ వాహనంలో పలు రేషన్ కార్డులను పరిశీలించారు. కార్డుదారులు లేకుండా వాహనంలో లబ్ధిదారుల కార్డులు ఎందుకున్నాయని ప్రశ్నించారు. దీనిపై సరైన సమాధానం చెప్పకపోవడంతో సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కార్డుదారులపై బియ్యం పంపిణీపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. పలువురు లబ్ధిదారుల నుండి బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అన్న వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించాలని ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు అందిస్తుందన్నారు. రేషన్ బియ్యం కూడా నాణ్యతలతో సరైన తూకంతో అందిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు బజార్లలో కూరగాయల ధరలు కూడా నియంత్రించడం జరుగుతుందని వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దానికి అనుగుణంగా తామంతా పనిచేస్తున్నట్లు మనోహర్ స్పష్టం చేశారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ రోడ్డులో అపరిశుభ్ర వాతావరణంపై ప్రశ్నిస్తున్న మనోహర్

ఉన్నత విద్యతో అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలి

● రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రి నాదెండ్ల


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీచేస్తున్న పౌరపరఫరాల శాఖ మంత్రి మనోహర్, సంఘ సభ్యులు

తెనాలి, మారీసుపేట జూలై 14: యువత ఉన్నత విద్యతో అత్యున్న శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక పద్మసాలిపేటలోని దామర్ల వారి వీధిలో ఆదివారం శ్రీవిరాట్ విశ్వబ్రహ్మ కల్యాణ మండపంలో తెనాలి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గుంటముక్కల అర్జున్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించి తమ కలలను సాకారం చేసుకోవాలని, ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. తమసంఘ అభ్యున్నతికి సంఘ సభ్యులు కృషి చేయాలని అన్నారు. అనంతరం 200 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వజ్రాల శివకుమార్, టి ఉదయశంకర్, మణికుమార్, శేషుబాబు, లక్ష్మి ప్రసాద్, మందలపు శ్రావణ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీచేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి, సంఘ సభ్యులు

తూటికాడతో నిండిపోయిన పంటకాల్వలు

▸▸ ముంపుకు గురవుతున్న వరినాట్లు ▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ ఆందోళనలో రైతులు


కొల్లిపర మండలం చివలూరులో చెరువులా మారిన వెదపద్ధతి ద్వారా వేసిన వరి పొలాలు

కొల్లిపర, జూలై 14: మండలంలో వేలాది ఎకరాల్లో సాగునీరందించే పంట కాల్వలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా కాల్వలపై ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో పంట కాల్వలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఫలితంగా చివరి భూములకు నీరందడం గగనంగా మారుతోంది. పంటకాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు తూటికాడంతో నిండిపోవడంతో ఎక్కడ మురుగునీరు అక్కడ స్తంభించిపోయింది. దీంతో రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంటకాల్వలు తూటికాడతో నిండిపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేకపోవడంతో పంట భూములు నీటితో నిండిపోతున్నాయి. వెదపద్ధతి ద్వారా వేసిన వరినాట్లు వర్షపునీరు, మురుగునీరు పోయేదారి లేకపోవడంతో దెబ్బతింటున్నాయి. పంట కాల్వలను పూడిక తీయించాలని అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు రైతులు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలోనైనా పంట కాల్వలు, మురుగు కాల్వలను అధికారులు మరమ్మతులు చేపడతారని రైతులు ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. ఆధునికీకరణ మాట అలా ఉన్న కనీసం మరమ్మతులు కూడ నోచుకోకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట కాల్వల మరమ్మతులు గురించి పట్టించుకోకపోవడంతో ఏటా వేలాది ఎకరాల్లోని పంట మునిగిపోతుంది. మండలంలో చెముడుబాడు సమీపంలో వరహాపురం చానల్, కొల్లిపర సమీపంలో బూత్‌మల్లి కాల్వ గురించి పట్టించుకున్న నాధుడే లేడని రైతులు వాపోతున్నారు. ఈ రెండు కాల్వలు పూర్తిగా పూడిపోవడంతో పాటు కాల్వలు కుచించుకుపోయాయి. ఇరుపక్కల ఏర్పాటు చేసిన కట్టలు కూడ పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక పర్యాయాలు కాల్వల మరమ్మతుల గురించి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఏ పంట కాల్వ చూచినా పిచ్చి మొక్కలతో, తూడికాడతో నిండి పోవడంతో వర్షపునీరు, మురుగునీరు స్తంభించి వేసినపంటలు ముంపునకుగురవుతున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం రైతులు తమ పంటలను కాపాడుకోవటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కనీసం పంట కాల్వల్లో నిండిపోయిన తూటికాడను, పిచ్చిమొక్కలను తొలగించి వర్షపునీరు, మురుగునీరు స్తంభించకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.


కొల్లిపర సమీపంలో తూటికాడతో నిండిపోయిన పంటకాల్వ

నిర్లక్ష్యం చేస్తే.. రెటినోపతితో చూపు కోల్పోతారు

గుంటూరు (మెడికల్) జూలై 14: మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే డయాబెటిస్ రెటినోపతి ద్వారా చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుం దని డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నేత్రవైద్య నిపుణులు రాచపల్లి కల్పనారెడ్డి తెలిపారు. ఆదివారం బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో జరిగిన రెటినోపతి ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. షుగర్ శాతం అసాధారణ స్థాయికి చేరితే రెటినాలో సూక్ష్మరక్త నాళాలు సన్నబడి, బలహీనపడి, కొవ్వు పదార్థాలు పేరుకుపోయి కంటి చూపు తగ్గుతుందని డాక్టర్ కల్పనారెడ్డి తెలిపారు. రెటినోపతిని తొలి దశలో గుర్తించేందుకు ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని, సమస్యను గుర్తిస్తే దానికి తగిన విధంగా వైద్యచికిత్సలు అందిస్తామన్నారు. అనంతరం రోగులకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్, మానవతా స్వచ్ఛందసేవా సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే సతీష్‌బాబు, కోశాధికారి టీవీ సాయిరాం, సీహెచ్ శివాజీ, సీ లక్ష్మీ, డీ సుధాకర్, జోస్నారెడ్డి, టీ కృష్ణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూలై 14: మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన పెండింగ్ జీవోలు వెంటనే జారీ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వెహికల్ షెడ్ విభాగం కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మి కుల జీతాల పెంపు గురించి 9మంది అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారని అన్నారు. అధికారుల కమిటీ నివేదిక రాష్ట్ర ఆర్థికశాఖ వద్ద పెం డింగ్‌లో ఉందని, వెంటనే ఆ కమిటీ నివేదికను ఆమోదించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మున్సిపల్ కార్మి కులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బి.ముత్యాలరావు, పూనే పల్లి శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరా వు, బి.సత్యనారాయణ, కె.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై గుంతలు ఏర్పడి నిలిచిన నీటిలో వెళుతున్న వాహనదారులు

గుంతలను పూడ్చరూ..!

తెనాలి రూరల్, జూలై 14: తెనాలి పట్టణంలోని డీఎస్పీ, సీడీపీవో కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో ఆ గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిత్యం అనేక పనులతో రాకపోకలు సాగించే వాహనదారులు ఈ గుంతలను దాటుకుంటూ వెళ్లే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న గుంతలపై కనీస మరమ్మతులు చేయించి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చూడాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


చేబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, భవన నిర్మాణ రంగ కార్మికులు

ఉచిత ఇసుకతో పేదలకు గృహ యోగం: టీడీపీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూలై 13: కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత ఇసుక విధానంతో పేదలకు గృహయోగం సులభతరం అవుతుందని చేబ్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు అన్నారు. ఆదివారం చేబ్రోలులో ఉచిత ఇసుకపై అవగాహన ర్యాలీ, ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. చేబ్రోలు సెంటర్‌లో టీడీపీ, జనసేన నాయకులు భవన నిర్మాణ రంగ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉచిత ఇసుక అందచేస్తునందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత పాలనలో ఇసుక వైసీపీ నేతల కనుసన్నలలో అమ్మకాలు జరిగి ప్రజలకు అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు. ఇసుక లభించక నిర్మాణ రంగం కుదేలై భవన నిర్మాణరంగ కార్మికులు పనులు కోల్పోయారని తెలిపారు. పనులు లేక పస్తులుండి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు రాష్ట్రంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉచిత ఇసుకను అమలులోకి తెచ్చి ప్రజలకు ఎన్డీఏ ప్రభుత్వం మంచి చేసిందన్నారు. ఇందుకు కృతజ్ఞతగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథయాత్ర


చింతలపూడిలో సాగుతున్న రథయాత్ర

పొన్నూరు టౌన్, జూలై 13: మండల పరిధిలోని చింతలపూడి నుంచి పట్టణంలోని పాతపొన్నూరు వరకు ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. చింతలపూడిలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన రథ వాహనంపై శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చింతలపూడి మీదుగా వీవర్స్ కాలనీ, పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్, పాతపొన్నూరు వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర ఈ రథయాత్ర సాగింది. రథయాత్ర పొడవున మహిళలు హరే రామ, హరేకృష్ణ సంకీర్తనలతో పాటు భక్తిపాటలను ఆలపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో భక్తులు ఇస్కాన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు

గుంటూరు(తూర్పు), జూలై 14: గత ఏడాది నవంబరు నుంచి మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయలేదని దీంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యా ర్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు అన్నారు. ఆదివారం గుంటూరు, కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం స్పందించి విద్యా ర్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనేకమార్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారా నికై ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు వసతి గృహాల్లో హస్టల్ నిద్ర కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెం 77ను రద్దు చేస్తానని యువగళం పాద యాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్ దుర్గాసాయి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హిందీ సినీ గీతాల విభావరి

గుంటూరు(తూర్పు), జూలై 14: స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సమర్పణలో గీతాంజలి ఆర్కెస్ట్రా సంస్థ నిర్వాహకుడు అమ్మపండు ఆధ్వర్యంలో ఏ షామ్ మస్తానీ-15 పాత హిందీ సినీ గీతాల కార్యక్రమం ప్రేక్షకులను అలరింపజేసింది. గాయనీ గాయకులు అమ్మ పండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, మానస, సింధు, కల్యాణ్, విజయ్ సాయి, శ్రీనివాసరావు, లలిత (పాడుతా తీయగా) హిందీ పాత చిత్రాల్లోని పాటలను ఆలపించారు. అనంతరం 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమానికి అండగా నిలబడిన ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్ర రాజును గీతాంజలి కళాకారులు ఘనంగా సత్కరించారు.